క్లుప్తంగా

'గ్రీన్ బాపట్ల'ను విజయవంతం చేయండి

పిట్టలవానిపాలెం: గ్రీన్ బాపట్ల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ భవనం మారుతీ శేషమాంబ ఆదేశించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులతో ఆమె గురువారం సమావేశం నిర్వహించారు. ఈ నెల 28న గ్రీన్ బాపట్ల కార్యక్రమాన్ని మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహించనున్నామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటేందుకు ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు వెల్లడించారు.

31న రేపల్లె మున్సిపల్ సాధారణ సమావేశం

రేపల్లె రూరల్: స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఈ నెల 31న సోమవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ విజయసారథి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ అధ్యక్షతన వహిస్తారని పేర్కొన్నారు. కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, అధికారులు సమావేశానికి హాజరు కావాలని తెలిపారు.

రీసర్వేను త్వరితగతిన పూర్తిచేయాలి

రేపల్లె రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మీ భూమి–మా హామీ కార్యక్రమాన్ని ప్రారంభించిందని తహసీల్దారు మల్లికార్జునరావు అన్నారు. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా కారుమూరు సచివాలయంలో మండల, గ్రామ సర్వేయర్లతో గురువారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. గతంలో భూకమతం ఒక సర్వే నంబరు కింద ఉండి, కాలక్రమేణా విభజన జరిగి చేతులు మారినా సర్వే రికార్డులు క్రమబద్ధీకరణ జరగకపోవటంతో భూ, ఇతర వివాదాలు, రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఇబ్బందులు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. ఈ సర్వేతో ఆ సమస్యలన్నీ పరిష్కారమవుతాయని చెప్పారు. రీసర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని సర్వేయర్లను తహసీల్దారు ఆదేశించారు.

4న అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం

భట్టిపోలు: భట్టిప్రోలు బస్టాండ్ సెంటర్‌లోని అభయాంజనేయస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం ఆగస్టు 4న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ, భక్త బృందం గురువారం ఒక ప్రకటనలో తెలిపాయి. స్వామి వారికి గణపతి పూజ, పుణ్యాహవచనం, నాగవల్లి దళాలతో విశేష అర్చన, అఖండ కర్పూర హారతి వంటి కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. అలాగే స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని పుర వీధుల్లో ఊరేగించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ జరుగుతుందని పేర్కొన్నారు.

చెట్లతో పర్యావరణానికి మేలు

ఏట్రావారిపాలెం(కర్లపాలెం): పచ్చని చెట్లు పర్యావరణానికి మేలు చేస్తాయని ఏట్రావారిపాలెం సర్పంచ్ చీరాల వెంకటలక్ష్మి తెలిపారు. స్థానిక గ్రామ సచివాలయం వద్ద గురువారం సిబ్బందితో కలసి ఆమె మొక్కలు నాటారు. గ్రీన్ బాపట్ల కార్యక్రమంలో భాగంగా ఏట్రావారిపాలెం గ్రామంలో మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెంకటలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చీరాల సత్యనారాయణరెడ్డి, పంచాయతీ కార్యదర్శి డి.పద్మావతి, వీఆర్వో సాంబయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నాటుసారా విక్రేత అరెస్ట్



రేపల్లె రూరల్: నాటు సారా విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న ఘటన లంకెవానిదిబ్బ గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. చోడాయపాలెం ఎస్ఐ శివప్రసాద్ వివరాలు వెల్లడిస్తూ.. తమకు అందిన సమాచారంతో లంకెవానిదిబ్బలో దాడులు నిర్వహించామన్నారు. కన్నా వెంకటేశ్వరరావు అనే వ్యక్తి నాటుసారా విక్రయిస్తూ పట్టుబడినట్లు తెలిపారు. అతని నుంచి 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని, నిందితుడిని కోర్టుకు హాజరుపరిచినట్లు వివరించారు.

రైల్వే ఆస్తులు ధ్వంసం చేస్తే కఠిన శిక్షలు

తెనాలి రూరల్: రైల్వే ఆస్తుల్ని ధ్వంసం చేయడం, నష్ట పరచడం వంటి చర్యలకు పాల్పడే వారికి కఠిన శిక్షలు పడే అవకాశముందని తెనాలి రైల్వే ప్రొటక్షన్ ఫోర్స్(ఆర్పీఎఫ్) ఏఎస్ఐ శివరామకృష్ణయ్య హెచ్చరించారు. బాపట్ల జిల్లా చుండూరు జెడ్పీ హైస్కూలులో విద్యార్థులకు, చుండూరు రైల్వే గేటు వద్ద నివాసితులకు గురువారం రైల్వే రూల్స్, రైళ్ల మీద రాళ్లతో దాడి, లెవల్ క్రాసింగ్ వద్ద పాటించాల్సిన నిబంధనల గురించి ఆర్పీఎఫ్ సిబ్బందితో కలసి అవగాహన కల్పించారు. చుండూరు గేటు వద్ద ప్రజలతో మాట్లాడారు. రైల్వే ఆస్తులకు నష్టం కలిగిస్తే, ప్రత్యేక న్యాయస్థానాల ద్వారా కఠిన శిక్షలు పడతాయని తెలిపారు. పట్టాలపై దుంగలు, నాణేలు ఇతర వస్తువులు పెట్టడం నేరమని చెప్పారు. రైళ్లు వెళుతున్న సమయంలో రాళ్లు విసరడం నేరమని, అలాంటివి వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పారదర్శక పాలనకు నిదర్శనం..జగనన్న ప్రభుత్వం

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున

యలవర్రు(వేమూరు): పారదర్శక పాలనకు నిదర్శనం జగనన్న ప్రభుత్వమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. అమర్తలూరు మండలంలోని యలవర్రు, యడవూరు గ్రామాల్లో గురువారం జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహించారు. యలవర్రు గ్రామ సచివాలయంలో జరిగిన జగనన్న సురక్ష శిబిరంలో మంత్రి మేరుగ నాగార్జున పాల్గొన్నారు. అర్జీదారులకు వివిధ ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'జగనన్న సురక్ష'తో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడం వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్ల ద్వారా ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి చెప్పారు. గతంలో ధ్రువపత్రాలు పొందాలంటే ప్రజలు రోజుల తరబడి సంబంధిత కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. జగనన్న సరక్ష కార్యక్రమంతో ధ్రువపత్రాలను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. వివిధ రకాల ధ్రువపత్రాలను మంత్రి అర్జీదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు మండే నాగేశ్వరరావు, కుర్రా నాగమల్లీశ్వరి, ఎంపీపీ నరేంద్ర, జెడ్పీటీసీ మూల్పూరు లావణ్య, ఎంపీటీసీ మానుకొండ ఝాన్సీరాణి, ఒలేటి శివాజీ తహసీల్దారు మెహరా, సుభాని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



యలవర్రులో ధ్రువపత్రం అందజేస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

జనరంజకం.. జగనన్న పాలన

రేపల్లె: ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ జగన్నాథం పార్థసారథి అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పట్టణంలోని 26, 27 వార్డుల సచివాలయల పరిధిలోని ప్రజలకు 14వ సచివాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉండి ఎటువంటి సంక్షేమ పథకానికి నోచుకోని వారికి సంక్షేమ పథకాలు అందించేందుకు ఈ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ మాట్లాడుతూ జగనన్న పాలన జనరంజకంగా ఉందని, ప్రజల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, కమిషనర్ విజయసారథి, కౌన్సిలర్లు డొక్కు లక్ష్మీనాగశ్వేత, షేక్ కరిమున్నీసా తదితరులు పాల్గొన్నారు.



ధ్రువపత్రం అందజేస్తున్న ఆర్డీఓ జగన్నాథం, మున్సిపల్ చైర్‌పర్సన్ మంగ

నేడు వేమూరులో 'జగనన్న సురక్ష'

వేమూరు: మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం–1, 2లో శుక్రవారం జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తహసీల్దారు శ్రావణ్‌కుమార్, పంచాయతీ విస్తరణాధికారి చొప్పర శేఖర్, ఆర్ఐ వెంకటేశ్వరరావు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

'జగనన్న సురక్ష'తో అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల అర్బన్: ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు 'జగనన్న సురక్ష' ద్వారా ఉచితంగా అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంకల్పించినట్లు ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. మండలంలోని అడివి పంచాయతీ పాండురంగాపురం గ్రామ సచివాలయంలో గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరంలో ఎమ్మెల్యే పాల్గొని, అర్జీదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో నెలలు తరబడి కార్యాలయాల చుట్టూ ప్రజలు తిరగాల్సి వచ్చేదన్నారు. 'జగనన్న సురక్ష' ద్వారా వలంటీర్లతో ప్రజల వద్దకే వెళ్లి.. దరఖాస్తులు స్వీకరించి వారికి అవసరమైన ధ్రువపత్రాలు ఉచితంగా అందించినట్లు చెప్పారు. పాండురంగాపురం సచివాలయానికి 2,500 దరఖాస్తుల రాగా అందరికీ ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ కొక్కిలిగడ్డ చెంచయ్య, ఎంపీపీ చిన్న పోతుల హరిబాబు, జేసీఎస్ కన్వీనర్ వడ్డీముక్కల డేవిడ్, ఏఎంసీ మాజీ చైర్మన్ కృష్ణమూర్తి, నక్క వీరారెడ్డి, బొడ్డు సుబ్బారెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు, తహసీల్దారు సుధారాణి, ఎంపీడీవో ఎ.రాధాకృష్ణ, ఈఓపీఆర్డీ పులి శరత్‌బాబు, సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు. బాపట్ల పట్టణంలోని తాలింఖానాలో జరిగిన జగనన్న సురక్ష శిబిరంలో ఎమ్మెల్యే కోన రఘుపతి పాల్గొని, ధ్రువపత్రాలు అర్జీదారులకు అందజేశారు. మున్సిపల్ కమిషనర్ ఎ.భానుప్రతాప్, నాయకులు ఇనగలూరి మాల్యాద్రి, తన్నీరు అంకమ్మరావు, కొటికలపూడి సురేష్ తదితరులు పాల్గొన్నారు.



అర్జీదారుడికి ధ్రువపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

వరిలో సస్యరక్షణ పాటించాలి

కర్లపాలెం: వరి సాగులో సస్యరక్షణ పద్ధతులు పాటించాలని డీడీఏ విజయనిర్మల తెలిపారు. కర్లపాలెం సచివాలయంలో రైతులకు గురువారం సాగులో సస్యరక్షణ చర్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వరి సాగులో అవసరం మేరకే ఎరువు వినియోగం ఉండాలని స్పష్టం చేశారు. పైర్లకు ఆశించే తెగుళ్లను గుర్తించి, సరైన మోతాదులోనే పురుగు మందు పిచికారీ చేయాలని చెప్పారు. వరిలో కాలి బాటలు ఏర్పాటు చేసుకోవడం వల్ల పైరుకు కావాల్సిన గాలి, వెలుతురు సమృద్ధిగా లభిస్తాయన్నారు. ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్ ఓబయ్య మాట్లాడుతూ.. భూమి ఆరోగ్యంగా ఉండాలంటే సేంద్రియ ఎరువులు అందించాలని తెలిపారు. భూమి సారవంతమయ్యేందుకు పచ్చిరొట్ట, జీవ ఎరువులు వినియోగించాలని పేర్కొన్నారు. వెద పద్ధతిలో సాగుచేసే రైతులు ముందుగా భూమిలో సింగిల్ ఫాస్పేట్, పొటాష్ చల్లుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ ఎ.లక్ష్మి, ఏఓ సుమంత్ కుమార్, ఏఈవో భాగ్యలక్ష్మి, గ్రామ వ్యవసాయ సహాయకురాలు భ్రమరాంబ, రైతులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీడీఏ విజయనిర్మల

పంట పరిరక్షణకు.. కర్షకుల కష్టం



క్రాప వద్ద వరి పొలంలోకి పైపును మోసుకెళ్తున్న రైతులు



వెద పద్ధతిలో సాగు చేసిన వరి పొలంలో వర్షపు నీటిని ఆయిల్ ఇంజిన్ సాయంతో తోడివేత

కొల్లూరు: ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల కారణంగా ముంపు బారిన పడిన పంటలను రక్షించుకునేందుకు కర్షకులు నడుం బిగించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో నాలుగు రోజులుగా వర్షాలు అధికంగా కురవడంతో ఖరీఫ్‌లో వెద పద్ధతిలో సాగు చేసిన వరి పొలాలు ముంపునకు గురయ్యాయి. గురువారం ముసురు పట్టిన వాన తెరపివ్వడంతో రైతులు పంటను కాపాడుకునే పనిలో పడ్డారు. ఎకరాకు రూ.3 వేల వరకు వెచ్చించి అద్దెకు ఆయిల్ ఇంజన్‌ల సాయంతో వర్షపు నీటిని బయటకు తోడే ప్రక్రియ చేపట్టారు. ఆయిల్ ఇంజన్ వెసులు బాటు లేని రైతులు కూలీల సాయంతో పొలంలో కాల్వలు తీసి నీటిని బయటకు మళ్లించేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.

భూ సర్వేను వేగవంతం చేయాలి

మున్సిపల్ కమిషనర్ విజయసారథి

రేపల్లె: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మీ భూమి–మా హామీ సర్వేను పట్టణంలో వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ విజయసారథి సర్వే అధికారులను ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో మీ భూమి–మా హామీ పథకం డైరెక్టర్ కోటేశ్వరరావుతో గురువారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. అనంతరం సర్వే సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే ఇసుకపల్లి రెవెన్యూ వార్డు పరిధిలో సర్వే నూరు శాతం పూర్తయ్యిందని తెలిపారు. రేపల్లె రెవెన్యూ వార్డు పరిధిలో జరుగుతున్న సర్వేను నిష్పక్షపాతంగా నిర్వహించాలని కమిషనర్ సూచించారు. సర్వేపై పట్టణ ప్రజల్లో ఉన్న అపోహలను తొలగిస్తూ, సర్వే వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలని సూచించారు. సర్వేతో భూ యజమానులకు ఖచ్చితమైన హద్దులు చూపటంతో పాటు శాశ్వత రెవెన్యూ భూ రికార్డుల్లో నమోదు చేయటం జరుగుతుందని వెల్లడించారు. దీంతో భవిష్యత్తులో భూ, ఇతర వివాదాలు, రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఇబ్బందులు చోటు చేసుకోవని స్పష్టం చేశారు. సచివాలయ సర్వే సిబ్బంది సర్వేకు ఇళ్లకు వచ్చిన సమయంలో ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కమిషనర్ విజయసారథి, సర్వే అధికారులు

మిషన్ ఇంద్ర ధనుష్ విజయవంతమే లక్ష్యం

కొల్లిపర: మిషన్ ఇంద్ర ధనుష్ ద్వారా ఆగస్టు నుంచి ప్రభుత్వం ప్రారంభించనున్న జాతీయ వ్యాధినిరోధిక టీకాల కార్యక్రమాన్ని ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు విజయవంతం చేయాలని మండల వైద్యాధికారిణి డాక్టర్ చిక్కాల లక్ష్మీసుధ, ఎంపీపీ భీమవరపు పద్మావతి తెలిపారు. అన్ని గ్రామాల్లో గర్భవతులు, పిల్లలకు టీకాలు వేస్తూ మండలంలో వంద శాతం పూర్తి చేయాలని చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులకు, వైద్య సిబ్బందికి టీకాల కార్యక్రమంపై అవగాహన కల్పించారు. డాక్టర్ సుధ మాట్లాడుతూ గ్రామాలల్లో ఇప్పటి వరకు వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోని గర్భిణులు, రెండేళ్లలోపు పిల్లల్ని గుర్తించి టీకాలు వేయాలని సూచించారు. ఆగస్టులో 7నుంచి 12వరకు, సెప్టెంబరులో 11నుంచి 16వరకు, అక్టోబరు లో 9నుంచి 14వరకు ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు సమష్టిగా టీకాలు వేయాలని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ జి.నాంచారయ్య, ఎంపీడీవో వి.చంద్రమోహన్, ఎంఈవో– 1 సాల్మన్‌రాజు , ఎంఈవో–2 ఝాన్సీలత, సీడీపీఓ సునీత, ఏపీఎం టి.సుజాత పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో మండల వైద్యాధికారిణి లక్ష్మీసుధ

అబ్దుల్ కలాం ఆశయాలు ఆదర్శం

కర్లపాలెం: మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఆశయాలు ఆదర్శవంతమైనవని మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు ఎండీ అమీర్‌బేగ్ అన్నారు. అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా తహసీల్దారు కార్యాలయం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి ముస్లిం నాయకులు గురువారం పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కర్లపాలెం గ్రామ సచివాలయంలో అబ్దుల్ కలాం చిత్ర పటానికి సర్పంచ్ నక్కా లలితకుమారి, కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు నివాళులర్పించారు. ఈ కార్యక్రమాలలో మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యులు షేక్ తాజుద్దీన్, షేక్ బాషా, ఎంపీటీసీ సభ్యుడు ఎస్కే ఆసిఫ్ అలీ, అహ్మద్ బాషా, షంషీర్, ఇమ్రాన్, జిలానీ, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.



కర్లపాలెంలో అబ్దుల్ కలాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న ముస్లిం నాయకులు

విభిన్న ప్రతిభావంతులకు ఆటల పోటీలు

భట్టిప్రోలు: సర్వ శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో విభిన్న ప్రతి భావంతులైన విద్యార్థుల (సీడబ్ల్యూఎస్ఎన్)కు గురువారం భట్టిప్రోలు టీఎంరావు హై స్కూల్‌లో ఆటల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు పరుగు పందెం, షాట్‌పుట్, డిస్క్ త్రో, ట్రై సైకిల్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎంఈవో–2 దేవరాజు, ప్రధానోపాధ్యాయుడు చందలూరి రామకోటేశ్వరావు, ఫిజికల్ డైరెక్టర్ తుమ్మా శ్రీనివాసరెడ్డి , పీఈటీలు చేబ్రోలు శ్రీనివాసరావు, ఎంపీఎస్ నాగేశ్వరావు, బీసీ హాస్టల్ వార్డెన్ చంద్రశేఖర్, ఐఈడీ టీచర్లు మేరీ ఇవాంజలిన్, టి.రత్నాకర్, సీఆర్పీలు సలోమి, కృష్ణారావు, రాజ్యలక్ష్మి, దాసరి లక్ష్మి పాల్గొన్నారు.



ట్రై సైకిల్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఎండీయూ ఆపరేటర్ల యూనియన్ నేతకు సత్కారం

తెనాలి: ఇంటింటికీ రేషను పథకంలో భాగమైన ఎండీయూ ఆపరేటర్ల యూనియన్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు చుండూరు సాంబశివరావు (శివ) రాష్ట్ర ఎండీయూ ఆపరేటర్ల యూనియన్ కోశాధికారిగా నియమితులయ్యారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని గురువారం సాయంత్రం నియోజకవర్గంలోని ఎండీయూ ఆపరేటర్లు, 26వ వార్డు కౌన్సిలర్లు ఇస్మాయిల్ ఆధ్వర్యంలో ఆయన్ను సత్కరించారు. గుంటూరు జిల్లా యూనియన్, తెనాలి పట్టణం, రూరల్ మండలం, కొల్లిపర మండలాల నిర్వాహకుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సుధాకర్‌రెడ్డి శివారెడ్డి, సునీల్, సురేష్, సయ్యద్ సుభాని, సత్యం, రమేష్, నరసయ్య, సువర్ణరాజు, గోపి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొని సాంబశివరావుకు శుభాకాంక్షలు తెలిపారు.

దారి దోపిడీ కేసులో నిందితుల అరెస్టు

తెనాలి రూరల్: తెనాలి పట్టణ శివారు పినపాడు దుండిపాలెం డొంక రోడ్డులో ఈ నెల 25న జరిగిన దారి దోపిడీ కేసును త్రీ టౌన్ పోలీసులు ఛేదించారు. ఆటో ఎక్కిన ఓ వ్యక్తిని మారుమూల ప్రదేశానికి తీసుకువెళ్లి బెదిరించి సెల్‌ఫోన్, నగదు లాక్కున్న ముగ్గురుని అదుపులోకి తీసుకున్నారు. స్థానిక త్రీ టౌన్ సర్కిల్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నిందితుల వివరాల్ని సీఐ ఎస్. రమేష్‌బాబు తెలియజేశారు. సుల్తానాబాద్‌లోని ఆలపాటి నగర్‌కు చెందిన ముప్పాళ్ల శివ చంద్రశేఖరరావు ఈ నెల 25న ఉదయం భట్టిప్రోలులో డ్యూటీకి వెళ్లి, తిరిగి రాత్రి 8.30 గంటలకు తెనాలి చేరుకున్నారు. ఇంటికి వెళ్లేందుకని మార్కెట్ వంతెన వద్ద ఆటో ఎక్కారు. ఆటోలో అప్పటికే ఇద్దరు యువకులు ఉండగా, తాను మార్కెట్ యార్డు వద్ద దిగుతానని చెప్పి చంద్రశేఖరరావు ఆటోలో కూర్చున్నారు. అప్పటికే ఆటోలో ఉన్న మోరిస్‌పేట సీఎం కాలనీకి చెందిన కట్టా ఏసయ్య అలియాస్ ఏసు, కొలవరం కాలువ కట్ట రోడ్డుకు చెందిన గుంజి శ్రీను, కమాధుల ఏసురత్నంలు సుల్తానాబాద్‌లో ఆటో ఆపకుండా పినపాడు గ్యాస్ గోడౌన్ సమీప నిర్మానుష్య ప్రాంతానికి చంద్రశేఖరరావును తీసుకు వెళ్లారు. అక్కడ అతడిని బెదిరించి జేబులో ఉన్న స్మార్ట్ ఫోన్, ఓ లెదర్ బ్యాగ్, రెండు వేల రూపాయల నగదు లాక్కున్నారు. అప్పుడే అటుగా ఓ మోటార్ బైక్ రావడంతో అది చూసి వారు ఆటోతో సహా పరారయ్యారు. దీనిపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఒక రోజు వ్యవధిలోనే ముగ్గురు నిందితుల్ని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నిందితుల్ని కోర్టులో హాజరుపరుస్తున్నట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు. వారి నుంచి బ్యాగుతో పాటు సెల్‌ఫోన్, నగదు, నేరం చేసేందుకు ఉపయోగించిన ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితుల్ని అరెస్టు చేసిన సిబ్బందిని ఆయన అభినందించారు.

రైల్వే విద్యుత్ తీగను పట్టుకుని గుర్తుతెలియని వ్యక్తి మృతి

తెనాలి రూరల్: రైల్వే విద్యుత్ తీగను పట్టుకుని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బాపట్ల జిల్లా చుండూరు రైల్వేస్టేషన్ వద్ద బుధవారం రాత్రి గూడ్స్ రైలు లూప్ లైన్‌లో నిలిపి ఉంది. ఈ సమయంలో 35నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సున్న వ్యక్తి గూడ్స్ బోగి ఎక్కి విద్యుత్ తీగలను పట్టుకున్నాడు. తీవ్ర గాయాలతో ఉన్న అతడ్ని 108లో గుంటూరు సమగ్ర వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు తెనాలి జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు మతిస్థిమితం లేని ఉత్తర భారతదేశానికి చెందిన వ్యక్తి అని తమ దర్యాప్తులో తెలిందని పోలీసులు వెల్లడించారు.

టైగర్ నాగేశ్వరరావు చిత్రాన్ని నిలుపుదల చేయాలి

బాపట్ల అర్బన్: టైగర్ నాగేశ్వరరావు సినిమాను నిలుపుదల చేయాలని గురువారం గ్రామంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఎంపీపీ చిన్న పోతుల హరిబాబు మాట్లాడుతూ టైగర్ నాగేశ్వరరావు సినిమా నిర్మాణాన్ని గ్రామ ప్రజలను సంప్రదించకుండా, వారి అనుమతి తీసుకోకుండా ప్రారంభించినట్లు తెలిపారు. దర్శకుడు వంశీకృష్ణ, నిర్మాత అభిషేక్ అగర్వాల్ స్టువర్టుపురంలో గతించిపోయిన నేర జీవితాలను తవ్వి, వాళ్ల సొంత ప్రయోజనాలకు టైగర్ నాగేశ్వరరావు జీవిత చరిత్రను సినిమాగా తీస్తున్నారని ఆరోపించారు. టైగర్ నాగేశ్వరరావు టీజర్‌లో దక్షిణ భారతదేశపు నేర రాజధానిగా స్టువర్టుపురం అని వ్యాఖ్యానించడం.. గ్రామంలోని ప్రతి ఒక్కరి మనోభావాలను కించపరిచే విధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ సెక్రెటరీ రాగాల చిన్న వెంకటేశ్వరరావు, డాక్టర్ పాకాల రాజేష్ కుమార్, కంపా కిరణ్, ఎస్టీ సెల్ మొగిలి మధు, రాగాల అనిల్, మేనపాటి శ్యామ్, బల్లని నాగరాజు, చౌట భాస్కర్ పాల్గొన్నారు.

లంక ప్రజలూ.. అప్రమత్తంగా ఉండండి !

కొల్లిపర: గత ఆరు రోజుల నుంచి కృష్ణా ఎగువ పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు సాగర్ నుంచి వరద నీటిని బుధవారం దిగువకు వదిలిన కారణంగా మండల పరిధిలోని లంక గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ జి.నాంచారయ్య, ఎంపీడీవో వి.చంద్రమోహన్ సూచించారు. మండల పరిధిలోని వల్లభాపురం, మున్నంగి, పిడపర్రు, కొల్లిపర, పాతబొమ్మువానిపాలెం, అన్నవరపు లంక, కొత్తూరు లంక గ్రామాల్లో గురువారం మండల స్థాయి అధికారులు సిబ్బందితో , పార్టీ నాయకులతో కలసి ఆయా గ్రామాల్లో వరద ఉద్ధృతి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలతో ఎంపీడీవో, తహసీల్దార్ మాట్లాడుతూ నదిలో వరద నీరు చేరడం వల్ల లంక గ్రామాల్లో కూలీ పనులకు వెళ్లే వారంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాత్రిపూట సమయంలో తప్పని పరిస్థితిలో మాత్రం పడవ వేయాలని చెప్పారు. నదిలో వరద ఉద్ధృతి పూర్తిగా తగ్గే వరకూ పిల్లలు, వృద్ధులు ఇటు వైపు రాకుండా వీఆర్వోలు, వీఆర్ఏలు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయా గ్రామాల్లో సర్పంచులు, పోలీస్ సిబ్బంది, వీఆర్వోలు ఎప్పటికప్పుడు వరద ఉద్ధృతి, గ్రామాల్లోని పరిస్థితుల్ని పరిశీలిస్తూ తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. వరద ఉద్ధృతి పెరిగే అవకాశాలు ఉంటే వెంటనే లంక ప్రజల్ని తూములూరు, కొల్లిపర, హనుమాన్‌పాలెం పాఠశాలలోకి తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ ఆర్. రవీంద్రరెడ్డి, కొల్లిపర ఎంపీటీసీ మాజీ సభ్యుడు భీమవరపు సంజీవరెడ్డి, బొమ్ము శ్రీనివాసరెడ్డి, అవుతు పోతిరెడ్డి పాల్గొన్నారు.